కూటమి నాయకులకు 'ఉపాధి'!

- ఉపాధి పథకం కింద రోడ్డు పనులు కూటమి నాయకులకు కేటాయింపు
- శ్రమ శక్తి సంఘాల ఏర్పాటుతో మేటీలకు పెద్దపీట
- అక్రమాల కారణంగా మేటీల వ్యవస్థను ఎత్తివేసిన గత ప్రభుత్వం
- కార్యకర్తల జేబులు నింపడానికి పునరుద్ధరించిన కూటమి సర్కారు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఆలూరు రూరల్: ఉపాధి హామీ పథకం కూటమి నేతలు, కార్యకర్తలకు కల్పతరువుగా మారింది. వలసలు నివారించడానికి, కరువు ప్రాంతాలలో కూలీలకు పనులు కల్పించడానికి తెచ్చిన మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆ పార్టీ నాయకుల జేబులు నింపేందుకు వినియోగిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం ఇప్పటికే ఉపాధి నిధులతో సీసీ, బీటీ రోడ్ల పనులు మంజూరు చేసి కూటమి కార్యకర్తలకే కేటాయించింది. తాజాగా శ్రమ శక్తి సంఘాలు ఏర్పాటు చేసి ఆ సంఘానికి ఒక మేటీని నియమించి గౌరవ వేతనం అందించేందుకు చర్యలు తీసుకుంది.

మేటీల వ్యవస్థతో అక్రమాలకు చోటు

ఉపాధి పనుల్లో 2014 నుంచి 2019 వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎన్నో అక్రమాలు చేశారని అనేక ఆరోపణలు ఉన్నాయి. కాంపోనెంట్ పనుల్లో రూ.100కు రూ.50 వరకు ఖర్చు చేసి సగానికిపైగా స్వాహా చేశారని గతంలో కూలీలే చెప్పుకున్నారు. నాడు కూడా శ్రమ శక్తి సంఘాలు, మేటీలను ఏర్పాటు చేసి దొచిపెట్టారు. కొందరు మస్టర్లు వేయకుండానే పనులు చేయించడం, కొన్ని చోట్ల పనులు చేయకుండానే బిల్లులు చేసుకొని జేబులు నింపుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. కాగా, ఇప్పటికే కొందరు నాయకులు బోగస్ మస్టర్లుతో కూలీల పొట్టగొడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పనులు కూడా కేవలం కూటమి సానుభూతి పరులకు మాత్రమే కేటాయిస్తున్నారనే చర్చ ఉంది.

అక్రమాలకు చెక్ పెట్టిన గత ప్రభుత్వం

ఉపాధిలో జరిగే అక్రమాలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. 2019 వరకు ఉపాధి హామీ పథకం వ్యవహారాలను టాటా కన్సల్టెన్సీ సర్వీస్ (టీసీఎస్) సాఫ్ట్‌వేర్‌లో నిర్వహించే వారు. ఇది పారదర్శకంగా లేకపోవడంతో గత ప్రభుత్వం నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) సాఫ్ట్‌వేర్‌కు మార్చింది. దీంతో పాటు శ్రమ శక్తి సంఘాలు, మేటీల వ్యవస్థను రద్దు చేయడంతో పనులు పారదర్శకంగా జరిగాయి.

నియోజకవర్గంలో జాబ్ కార్డులు, కూలీల వివరాలు

మండలం	జాబ్‌కార్డులు	కూలీల సంఖ్య	ఏర్పాటైన సంఘాలు
ఆలూరు	8,950	15,945	43
ఆస్పరి	11,860	22,000	53
చిప్పగిరి	6,262	11,142	40
హాలహర్వి	9,096	16,179	55
హొళగుంద	8,843	16,415	77
దేవనకొండ	11,473	21,466	37

మేటీలకు వేతనం

శ్రమశక్తి సంఘం లీడర్‌ను మేటీ అంటారు. కూలీలను పనికి తీసుకెళ్లే బాధ్యత మేటీదే. ఈయన కూడా కూలీలతో పాటు పనిచేయాల్సిందే. కానీ వీరు కూలీ చేయకుండానే వేతనం పొందుతారు. కూలీలపై పెత్తనం చెలాయిస్తారు. లీడరుగా ఉన్నందున ఒక కూలీపై రోజుకు రూ.1.50 చొప్పున 100 రోజుల పని దినాలు పూర్తయితే రూ.3 చొప్పున మెటీరియల్ నిధుల నుంచి గౌరవ వేతనంగా చెల్లిస్తారు.

సంఘాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాం



గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు శ్రమ శక్తి సంఘాల నియామకం ప్రక్రియ ప్రారంభించాం. 25 నుంచి 50 మంది కూలీలకు ఒక సంఘం ఏర్పాటు చేసి లీడరుగా మేటీని నియమిస్తాం. ఇప్పటి వరకు 305 సంఘాలు ఏర్పాటు చేశాం. మేటీలకు వేతనం ఎంత ఇస్తారనేది ఇంకా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు అందలేదు.

– పద్మావతి, ఆలూరు ఉపాధి హామీ ఏపీడీ

మేటీల నియామకానికి చర్యలు

ఆలూరు నియోజకవర్గంలో 56 వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆరు మండలాల్లో శ్రమ శక్తి సంఘాలు ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి 25 నుంచి 50 మంది కూలీలకు ఒక సంఘం ఏర్పాటు చేసి అందుకు ఒక మేటీని నియమిస్తున్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే మొదలైంది. ఇప్పటి వరకు 305 సంఘాలు ఏర్పాటు చేశారు. మేటీల నియామకం ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫీల్డ్ అసిస్టెంట్లు, శ్రమ శక్తి సంఘాల లీడర్ల ఆధ్వర్యంలోనే ఉపాధి పనులు జరుగుతాయి. పనులు చేయించడం, మస్టర్లు యాప్‌లో నమోదు చేయడం అంతా వారే చూడనున్నారు. ఇప్పటికే అనేక చోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించి కూటమి కార్యకర్తలను నియమించారు.

క్లుప్తంగా

ముగిసిన దస్తగిరి స్వామి ఉరుసు


దస్తగిరి స్వామి గుర్రాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో ఆదివారం జియారత్ వేడుకలతో దస్తగిరి స్వామి ఉత్సవాలు ముగిశాయి. ఈసందర్భంగా భక్తులు స్వామివారి దర్గాను దర్శించుకు సమర్పించారు. దస్తగిరి స్వామి గుర్రాన్ని భక్తులు మేళతాళాలతో ఊరేగించారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కో కన్వీనర్‌గా శ్రీకాంత్‌లాల్



మద్దికెర : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ వేదిక కో కన్వీనర్‌గా వైఎం శ్రీకాంత్‌లాల్ ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన పరిరక్షణ వేదిక కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అందులో భాగంగా జిల్లాలో ఇద్దరికి స్థానం కల్పించారు. అలాగే జిల్లాకు చెందిన హరిహరరెడ్డిని రాష్ట్ర కోశాధికారిగా ఎన్నుకున్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం


సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్, సర్పంచు కొమ్ము దీపిక

పత్తికొండ రూరల్ : పత్తికొండలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను ఆదివారం ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ ప్రారంభించారు. ఉప్పరకట్ట నుంచి తేరుబజారులోని మసీదు వరకు ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్, గ్రామ పంచాయతీ నిధులు రూ.54లక్షలు, అలాగే ముస్లిం వీధిలో రూ.13లక్షలతో నిర్మించిన రోడ్లకు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో సర్పంచు కొమ్ము దీపిక, కాంట్రాక్టర్ దశరథరామిరెడ్డి, గ్రామపంచాయతీ ఈఓ నరసింహులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

పత్తికొండ రూరల్ : పత్తికొండలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవ మూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపించిన అనంతరం వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు మాంగళ్యధారణ చేశారు. వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు రథోత్సవం :

సోమవారం ఉదయం 9గంటలకు పంచకలశ స్థాపన, బ్రహ్మరథాంగ హోమం, బలిహరణం పూజల అనంతరం మధ్యాహ్నం 11.45 గంటలకు బ్రహ్మరథం, సాయంత్రం 4గంటలకు రథోత్సవం ఉంటుందని ఆలయ ధర్మకర్త ఎల్లారెడ్డి తెలిపారు.

నేటి నుంచి శ్రీరంగాపురంలో నవగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు


ప్రతిష్ఠించేందుకు సిద్ధంగా ఉన్న నవగ్రహ విగ్రహాలు

వెల్దుర్తి: మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామం శివలీల ముద్దయ్యస్వామి శివాలయంలో ఈనెల 19న నవగ్రహాల విగ్రహ ప్రతిష్ఠ చేపట్టనున్నారు. ఈ మేరకు ఆదివారం నిర్వాహకులు నవగ్రహాలు, నాగ పడగలను గ్రామానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. సోమవారం నుంచి ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, తొలిరోజు విగ్రహాల ధాన్యాధివాసం, 18న జలాధివాసం తదితర ప్రతిష్ఠ కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. నవగ్రహాల కట్ట ఏర్పాటుతో పాటు విగ్రహాలను వెల్దుర్తి పట్టణానికి చెందిన చిరంజీవి అందించారని, నాగమ్మ పడిగలను గొల్లపల్లి మద్దయ్య, బాల లక్ష్మీరమణ అందించారని తెలిపారు.

రేపు బండలాగుడు పోటీలు

దేవనకొండ: మండలంలోని కొత్తపేట గ్రామంలో మస్తాన్‌వలిబాబా ఉరుసు సందర్భంగా ఈనెల 18న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.15 వేలు, ఆరో బహుమతి రూ.10 వేలు అందజేస్తామన్నారు.

కరుణించు గాయత్రీ మాత



ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన పంచముఖి గాయత్రీ మాత ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వేదపండితులు అనిల్ కుమార్ శర్మ, రామసుబ్బయ్య శాస్త్రి, సరేంద్ర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి గంగ, ఆకుపూజ, గణపతి హోమం, చండి పారాయణము, పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం


కొత్తగా చేయించిన రథం

గాయత్రీమాత ఉత్సవాలలో భాగంగా భక్తులు, దాతలు సహకారంతో రూ.12లక్షలతో చేయించిన కొత్త రథానికి ప్రత్యేక పూజలు చేసి సోమవారం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు రూపామోహన్‌శర్మ తెలిపారు. అంతే కాకుండా 12 జ్యోతిర్లింగాలు, నంది, అభయాంజనేయస్వామి, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిష్ఠించే విగ్రహాలను శంకరబండ గ్రామంలో శనివారం మేళతాళాలతో ఊరేగించారు.

సీఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలి


దస్తగిరి స్వామికి ఫతేహాలు సమర్పిస్తున్న తెర్నెకల్ సురేంద్రరెడ్డి

ఆలూరు: ఏపీ సీఎం చంద్రబాబునాయుడి వక్ర బుద్ధిని మార్చి మంచి బుద్ధిని ప్రసాదించాలని దస్తగిరి స్వామిని కోరుకున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తెర్నెకల్ సురేంద్రరెడ్డి తెలిపారు. ఆదివారం ఆస్పరి మండలం ములుగుందం గ్రామంలోని దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా దర్గాను దర్శించుకొని ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. అనంతరం దర్గ వద్ద ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చేందుకు చంద్రబాబు నాయుడు, జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ప్రజలకు ఎన్నో రకాల పథకాలను అమలు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం దారుణమన్నారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్‌కు నిధులు లేవు, లోటు బడ్జెట్ ఇలా దారుణంగా శాసనసభలో ప్రస్తావించడం సీఎం చంద్రబాబునాయుడికి తగునా అని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, అలిగేర గ్రామ నాయకుడు వెంకటరెడ్డి, పుటకలమర్రి గ్రామ సర్పంచ్ శివారెడ్డి, దేవనకొండ మండలం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు అరుణకుమార్, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠం కుటుంబానికి అండగా ఉంటాం

హొళగుంద: సౌమ్యుడిగా ఉంటూ పార్టీ కోసం కష్టపడిన వైకుంఠం కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేంద్రరెడ్డి అన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన ఎల్లార్తికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మాల వైకుంఠం కుటుంబ సభ్యులను ఆదివారం ఆయన పరామర్శించారు. మృతుడి భార్య ఈరమ్మ, కుమారులకు ధైర్యం చెప్పారు. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాయకులు వెంకటరెడ్డి, అశోక్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, లింగప్ప, చంద్రశేఖర్, రవి, శేషి ఉన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హోదా మరిచి మాట్లాడకండి

దేవనకొండ: జిల్లా బీసీ సంఘం ఉపాధ్యక్షుడు మలకన్న తన హోదాను మరిచి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి గురించి మాట్లాడటం తగదని మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, జెడ్పీటీసీ కిట్టు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుల మీద అక్రమ కేసులు పెట్టడం లేదా? అని ప్రశ్నించారు. ముందు మీరు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. మీ స్థాయి ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి కాదని, ఏదైనా మాట్లాడేటప్పుడు హోదాకు తగ్గట్టు మాట్లాడాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల కోకన్వీనర్ కబీర్‌దాస్, జుబేర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు


స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారం సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జలాభిషేకం, మహా మంగళహారతి, సుప్రభాతసేవ, బండరార్చన, కుంకుమార్చనతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. స్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక, ఆంధ్ర ప్రాంతం నుంచి భక్తులు తరలి వచ్చారు. కొందరు భక్తులు అన్నదానం, ఇతర కార్యక్రమాలు చేపట్టారు. శివమాల ధరించిన నెరణికి తదితర గ్రామాలకు చెందిన దాదాపు 30 మందికి పైగా శివస్వాములు మాళ మల్లేశ్వరస్వామి సన్నిధిలో ఇరుముడి కట్టుకుని శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.


శ్రీశైలానికి పాదయాత్ర ప్రారంభిస్తున్న శివస్వాములు

షాదీఖానా కమిటీ ప్రమాణ స్వీకారం

పత్తికొండ రూరల్ : పత్తికొండ ముస్లిం వీధిలోని షాదీఖానా కమిటీ చైర్మన్‌గా గుండు ఫకృద్దీన్ ఎన్నికయ్యారు. ఆదివారం ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ సమక్షంలో సమావేశ భవనంలో కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా కాశీం, రజాక్, బాబాఫకృద్దీన్, మస్తాన్‌బీలను ఎన్నుకున్నారు.

వాహనాల తనిఖీ

వెల్దుర్తి: పట్టణ పరిధిలోని హైవే 44పై ఆంజనేయస్వామి విగ్రహ సర్కిల్‌లో ఆదివారం ఎస్ఐ అశోక్ వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు పాటించని వాహనదారులకు రూ.4వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. సరైన పత్రాలు లేని, హెల్మెట్, సీటు బెల్ట్ ధరించని వారికి నిబంధనలు పాటించాలంటూ అవగాహన కల్పించారు. హెచ్‌సీ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు 4,694 మంది నమోదు

తుగ్గలి : మండలంలో 4,694 మందికి రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేశామని వ్యవసాయశాఖ మండల అధికారి పవన్ కుమార్ ఆదివారం తెలిపారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో గత వారం రోజులుగా వ్యవసాయ సిబ్బంది గుర్తింపు సంఖ్య నమోదు చేస్తున్నారన్నారు. మండలంలో మొత్తం 17,195 మంది రైతులకు గాను ఇప్పటి వరకు 4,694 మందికి రిజిస్ట్రేషన్ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను సులభంగా పొందడానికి ప్రతి రైతుకూ ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ప్రభుత్వం తప్పనిసరి చేసిందన్నారు. రైతులు తమ ఆధార్ నంబర్, ఆధార్, బ్యాంకు ఖాతా అనుసంధానిత ఫోన్ నంబర్, పట్టాదార్ పాసుపుస్తకంతో గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈనెల 25వతేదీలోగా రైతులందరూ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

దోమల నివారణకు ఫాగింగ్

హాలహర్వి: మండల కేంద్రమైన హాలహర్విలో దోమల నివారణకు ఆదివారం రాత్రి సర్పంచ్ మల్లికార్జున ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ఫాగింగ్ చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ దోమకాటుకు ప్రజలు గురికాకుండా ఉండేందుకు, దోమల నివారణకు ముందు జాగ్రత్తగా ఫాగింగ్ చేయించినట్లు తెలిపారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చూసుకోవాలన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ఆలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తహసీల్దార్ గోవిందసింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆర్ఐ బసన్నగౌడు ఆదివారం తెలిపారు. ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాశివరాత్రి విశిష్టతను తెలుసుకోండి


ఆలంకొండలో ఇంటింటికీ తిరిగి భగవద్గీతను అందజేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

కృష్ణగిరి: ఈ నెల 26న జరుపుకునే మహా శివరాత్రి పండుగ విశిష్టతను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక డోన్ కమిటీ అధ్యక్షుడు నాగార్జున పిలుపునిచ్చారు. ఆదివారం సమితి సభ్యులతో కలిసి ఆయన ఆలంకొండ గ్రామంలో ఇంటింటికీ తిరిగి త్రైత సిద్ధాంత భగవద్గీతను అందజేసి మహాశివరాత్రి ప్రాముఖ్యతను గురించి వివరించారు. కార్యక్రమంలో సమితి సభ్యుల నాగేంద్ర, సుబ్బయ్య, శివకుమార్, వెంకటేశ్వర్లు, గిరి, సుంకన్న, లక్ష్మి, భాగ్యలక్ష్మి, శశికళ, లీలావతి పాల్గొన్నారు.

హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం విఫలం


నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే విరూపాక్షి

దేవనకొండ: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యిందని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. ఆదివారం మండలంలోని పల్లెదొడ్డి గ్రామంలో సర్పంచ్ చంద్రన్న నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించారని, తల్లికి వందనం పథకాన్ని నీరుగార్చారన్నారు. ప్రజలతో కలిసి ప్రభుత్వంపై పోరాడాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రామకృష్ణ, నాయకులు దివాకర్‌నాయుడు, ఉమాంబ, మండల కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


ట్యాంకును కూల్చిన దృశ్యం

ఎట్టకేలకు కూల్చేశారు..


కోగిలతోటలో శిథిలావస్థలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు(ఫైల్)

హొళగుంద: కోగిలతోట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకును ఆదివారం కూల్చేశారు. దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ నీటి ట్యాంకు గ్రామానికి తాగునీరు అందించింది. అయితే కొద్ది కాలంగా పిల్లర్ల పెచ్చులూడి కడ్డీలు బయటకు తేలి ప్రమాదకరంగా మారింది. అక్కడే పాఠశాల ఉండటం, విద్యార్థులు తిరుగుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. విషయాన్ని ఎస్ఎంసీ చైర్మన్, తల్లిదండ్రులు గ్రీవెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారి ఆదేశాల మేరకు ఆదివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామ్‌లీల స్థానిక సర్పంచ్ బోయ యాట గురుపాదమ్మ సహకారంతో ట్యాంకును కూల్చివేశారు. ప్రస్తుతం గ్రామ ప్రజలకు సమ్మతగేరి వద్ద ఉన్న ఎల్లార్తి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నుంచి నేరుగా తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

జాతర ముగిసింది.. మురుగు మిగిలింది!


పోలీస్ స్టేషన్ పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

హొళగుంద: మండలం కేంద్రం హొళగుందలో ఇటీవల జరిగిన సిద్ధేశ్వరస్వామి జాతర జరిగింది. జాతరలో స్థానిక పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న స్థలంలో జాయింట్ వీల్, బోటింగ్, ఊయాల తదితర ఆటల సామగ్రి వేసి వారం రోజుల పాటు వ్యాపారాలు చేసుకున్నారు. అయితే జాతర ముగిసిన తర్వాత వ్యాపారులు మురుకినీరు, చెత్తను మిగిల్చి వెళ్లారు. ఆ ప్రాంతం అంతా చెత్తాచెదారం నిండి, మురుగుమయమై, కంపు కొడుతోంది. నిలిచిన నీటిలో పందులు, కుక్కలు దొర్లి మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


మిఠాయిల అంగడి

మద్దికెరలో తిరునాల సందడి

మద్దికెర : గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించే జాతర వంటి పండుగలు గ్రామాలకు కొత్త శోభను తీసుకువస్తాయి. తిరునాలకు దూరపు చుట్టాలను, ఆడపిల్లలను పిలిచి ఎంతో వైభవంగా నిర్వహిచడం, అందులో భాగంగా మహిళలకు గాజులు వేయించి, స్వీట్లు ఇచ్చి పంపడం ఆనవాయితీ. మండల కేంద్రమైన మద్దికెరలో మద్దమాంబ తిరునాల సందర్భంగా ఏర్పాటు చేసిన అంగళ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రతి ఇల్లు బంధువులు, మిత్రులతో కళకళ లాడుతోంది. ఇంటికి వచ్చిన ఆడపిల్లలకు గాజులు వేయించడం, పిల్లలకు ఆట వస్తువులు కొనుగోళ్లలో జాతర సందడిగా కనిపిస్తోంది.


పిల్లల కోసం బొమ్మల అంగడి


గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు